క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ప్రచారం



ప్రచారం చేస్తున్న మైనార్టీ నాయకులు

విడపనకల్లు: మండల కేంద్రంలో వైఎస్సార్‌ సీపీ విజయం కోసం పార్టీ మైనార్టీ విభాగం నాయకులు శుక్రవారం విస్తృత ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. మైనార్టీలు టీడీపీని నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నాయకులు లతీఫ్, నూర్, వలీ, వడ్ల సలీం, మీరం బాషా, ఎస్సీసెల్ జిల్లా నాయకులు సుంకన్న, నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతా

బెళుగుప్ప: మండల కేంద్రంలోని వైఎస్సార్‌ సర్కిల్ వద్ద మాస్ ఎడ్యుకేషన్, చైల్డ్ ఫండ్ ఇండియా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఎయిడ్స్ నియంత్రణపై శుక్రవారం కళాజాతా నిర్వహించారు. హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలని వివరించారు. కార్యక్రమంలో కళాజాతా బృందం ఆర్గనైజర్ శ్రీనివాసులు, చైల్డ్ ఫండ్ ఇండియా వర్కర్ నాగరాజు, మాస్ ఎడ్యుకేషన్ ఔట్రీచ్ వర్కర్ లక్ష్మి, పీఈఎస్ శిల్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే జగనన్న లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీపీ పుష్పావతి

విడపనకల్లు: పేదల ఆరోగ్యమే సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ కరణం పుష్పావతి అన్నారు. శుక్రవారం పెద్ద కొట్టాల పల్లి పీహెచ్‌సీ పరిధిలోని వేల్పుమడుగులో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సత్యబాబు, ఎంపీహెచ్ఈఓ తిరుపాల్ నాయక్, సూపర్ వైజర్లు పద్మజ కుమారి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

413 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు సందేష్ కుమార్

గుమ్మఘట్ట: మండలంలోని శిరిగేదొడ్డి లో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి స్పందన లభించింది. 413 మందికి వైద్యులు రమేష్, బాలాజీనాయక్, సందేష్ కుమార్, కంటి వైద్యులు భాస్కర్ పరీక్షలు నిర్వహించి, వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు ఆది బయమ్మ, జయమ్మ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



కూడేరు: పౌష్టికాహారాన్ని అందిస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణ

కూడేరు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని వైద్యాధికారి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండలానికి ప్రధాన మంత్రి క్షయ ముక్త్ భారత్ కార్యక్రమం ద్వారా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సామాజిక కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని సరఫరా చేసింది. శుక్రవారం మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ వ్యాధిగ్రస్తులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా మందులు వాడి, పౌష్టికాహారం తీసుకుంటే జబ్బు పూర్తిగా నయమవుతుందన్నారు. కార్యక్రమంలో క్షయ విభాగం అధికారులు సునీర్ షా, జాఫర్ బాషా, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, సూపర్ వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ శిరీనా, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేస్తే చర్యలు



బాల్య వివాహాలతో అనర్థాలను వివరిస్తున్న సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న

బ్రహ్మసముద్రం : బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కళ్యాణదుర్గం ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని గుడిపల్లిలో ఏడోతరగతి విద్యార్థికి వివాహం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సమాచారం అందింది. దీంతో కళ్యాణదుర్గం సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న , పంచాయతీ కార్యదర్శి వెంకటరాము డు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖాసీంబీ, పోలీస్ సిబ్బంది గ్రామానికి చేరుకొని బాలిక తల్లి దండ్రులతో మాట్లాడారు.

రూ.32 లక్షలతో అభివృద్ధి

- కంబదూరు మండలంలోని గ్రామాల్లో తీరనున్న సమస్యలు
- ఎంపీ నిధుల నుంచి రూ.34.32 లక్షలు కేటాయించిన ఎంపీ రంగయ్య
- తాగునీరు, వీధిలైట్ల సమస్యకు పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

తాగునీటికి మంజూరు చేసిన నిధులు

గ్రామం	నిధులు
దేవేంద్రపురం	రూ.2.2 లక్షలు
అండేపల్లి	రూ.2.2 లక్షలు
కోటగుడ్డం	రూ.2.2 లక్షలు
ఎం.మంద	రూ.2.2 లక్షలు
మర్రిమాకులపల్లి	రూ.2.2 లక్షలు
కంబదూరు	రూ.2 లక్షలు
గూళ్యం	రూ.2 లక్షలు



శెట్టూరు మండలం అనుపల్లిలో నిధుల మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎంపీ రంగయ్య

కళ్యాణదుర్గం: ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో ఇక తాగునీరు, వీధిలైట్ల సమస్యకు చెక్ పడనుంది. ఎంపీ నిధులతో ఈ పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. ఇటీవల కంబదూరు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఎంపీ రంగయ్య.. పలు సమస్యలు గుర్తించారు. ప్రజల ఫిర్యాదు మేరకు తాగునీటి అవసరాలకు రూ.24 లక్షల నిధులు కేటాయించారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో బోర్ల తవ్వకం, పైప్ లైన్ పనులను త్వరగతిన పూర్తి చేసేలా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులను ఆదేశించారు. వేసవిలో ఏ ఒక్క గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక చొరవతో నిధులు కేటాయించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

480 ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు

గ్రామాలు చీకట్లో ఉండకూడదన్న ఉద్దేశంతో కంబదూరు మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో ఏకంగా రూ.10.32 లక్షల వ్యయంతో 480 ఎల్ఈడీ వీధిలైట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ఎంపీ నిధులు కేటాయిస్తూ ప్రొసీడింగ్స్ అందజేశారు. ఒక్కో ఎల్ఈడీ లైట్‌కు రూ.2,150 చొప్పున ఖర్చు చేస్తున్నారు. ఈ లైట్లు కూడా ఎక్కువ కాలం మన్నిక ఉండేలా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

తాగునీటికి నిధులిచ్చారు



ఇటీవల ఎంపీ రంగయ్య గ్రామాల్లో పర్యటించారు. మా ఊర్లో నీటి సమస్యను ఎంపీకి తెలియజేశాం. మా ఊరికి వచ్చినప్పుడు కూడా కలిశాం. అడిగిన వెంటనే సమస్యను గుర్తించి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రూ.2 లక్షల నిధులు కేటాయించారు. ఇక వేసవిలో మాకు తాగునీటి కష్టాలు తీరినట్లే. త్వరలోనే పనులు పూర్తి చేసి నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ రంగయ్య అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్య తీరనుండటంతో సంతోషంగా ఉంది. – రామాంజి, స్థానికుడు, గూళ్యం

చాలా ఇబ్బందులు పడ్డాం



రాత్రిళ్లు ఊర్లో వీధిలైట్లు లేకా చాలా ఇబ్బందులు పడ్డాం. మా ఊరు సమీపంలో కొండలు, గుట్టలు ఉండటంతో రాత్రిళ్లు అడవిపందులు, ఎలుగుబంట్ల బెడద ఉండేది. వెలుతురు లేని కారణంగా అడవి జంతువులు ఊర్లోకి వచ్చేవి. చాలా భయపడేవాళ్లం. ఇప్పుడు ఊరంతా ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తామని ఎంపీ తలారి రంగయ్య తెలిపారు. ఇక అడవి జంతువుల నుంచి మాకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. – మార్కు, స్థానికుడు, అండేపల్లి

వైఎస్ జగన్‌తోనే సంక్షేమ సంబరం

- సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి



వలంటీర్లను సన్మానిస్తున్న మెట్టు గోవిందరెడ్డి



నీటి ట్యాంకును ప్రారంభించి దువా చేస్తున్న మెట్టు గోవిందరెడ్డి , ముస్లిం మైనార్టీ నాయకులు

రాయదుర్గంటౌన్: మోసపూరిత హామీలు ఇచ్చి నట్టేటముంచే నయ వంచకుడు చంద్రబాబును ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సంక్షేమ సంబరం సాధ్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ప్రజలకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని 26వ వార్డులో కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులతో కలిసి మైనార్టీ కాలనీల్లో పర్యటించారు. సాయంత్రం పట్టణంలోని వినాయక సర్కిల్ నుంచి బళ్లారి రోడ్డు బొడ్రాయి వరకు వాణిజ్య, వ్యాపార సముదాలు, చిరు వ్యాపారులను కలుసుకొని అన్ని వర్గాల సంక్షేమం కోసం మరోసారి సీఎంగా జగనన్నకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం 26వ వార్డు (ముస్లిం మైనార్టీ వార్డు) పర్యటనలో నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డికి స్వాగతం పలికారు. 26వ వార్డు పరిధిలోని తహసీల్దార్‌రోడ్డులో వార్డు కౌన్సిలర్ అఫ్గాన్ ఫకృద్దీన్ రూ.లక్ష సొంత నిధులతో ఏర్పాటు చేసిన నీటి సిస్టన్ ట్యాంకును ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, వైస్ చైర్మన్లు శ్రీనివాసులు, వలిబాషా, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, కౌన్సిలర్లు ఫకృద్దీన్, పొరాళ్ల గోవిందరాజులు, బండి అజయ్, మంజునాథ, వార్డు ఇన్‌చార్జ్‌లు గంగాధర్, కొలిమి ఆనంద్, హయత్‌బాషా, దాదు, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ పలకరింపు: పట్టణంలోని వినాయక సర్కిల్ నుంచి బళ్లారి రోడ్డు బొడ్రాయి వరకు మున్సిపల్ చైర్ పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం సాయంత్రం పర్యటించారు. ప్రతి దుకాణాదారుడు, చిరు వ్యాపారిని కలిసి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు అవకాశం కల్పించాలని కోరారు.

వలంటీర్ల సేవలు అమోఘం

రాయదుర్గంటౌన్: వలంటీర్ల సేవలు అమోఘమని సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 16వ సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ పరిధిలోని వలంటీర్లకు అవార్డులతో సత్కరించి, ప్రశంసా పత్రాలు అందించారు. కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, చుంచుల నాగప్ప, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నూతన సబ్ రిజిస్ట్రార్‌గా వెంకటనాయుడు



బాధ్యతలుచేపట్టిన సబ్ రిజిస్ట్రార్ వెంకటనాయుడు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం నూతన సబ్ రిజిస్ట్రార్‌గా వెంకట నాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ రామలక్ష్మీదేవి బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో అనంతపురంలో పనిచేస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన తెలియజేశారు.

ప్రకృతి ఒడిలో కొలువైన బూదిగుమ్మ క్షేత్రం

- నేడు హనుమంతరాయస్వామి రథోత్సవం



బూదిగుమ్మ హనుమంతరాయస్వామి ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

బెళుగుప్ప: పురాతన క్షేత్రాల్లో ఒకటైన బూదిగుమ్మ ఆలయం ప్రకృతి ఒడిలో కొలువైంది. ఇక్కడి హనుమంతరాయస్వామి, శ్రీపద్మావతి వెంకటరమణస్వామి ఆలయాలు ప్రసిద్ధమైనది. మండలంలోని రామసాగరం సమీపంలోని పెన్నానదీ పరీవాహక ప్రాంతం, జీడిపల్లి రిజర్వాయర్ మధ్య ఆహ్లాదకర వాతావరణంలో వెలసింది. ఏటా మాఘమాసం మూడో శనివారం రాత్రికి హనుమంతరాయస్వామి ఉత్సవం, ఆదివారం తిరునాలు నిర్వహించడం ఆనవాయితీ.

ఘనంగా ప్రారంభమైన రథోత్సవం..

బూదిగుమ్మ క్షేత్ర రథోత్సవాల సందర్భంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి సుప్రభాతసేవ, గణపతి, గోపూజ, రుద్రాభిషేకం, తులసి నామార్చన, పంచామృతాభిషేకాలు జరిగాయి. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహమూర్తులకు కనులపండువగా కల్యాణోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం గంగపూజ, గోపూజలతో అష్టోత్తర నామావళి, సహస్ర నామార్చన, మంత్రపుష్పం, శ్రీహనుమాన్‌చాలీసా, ఉయ్యాల సేవ కార్యక్రమాలు కొనసాగుతాయి. సాయంత్రం 4 గంటలకు హనుమంతరాయస్వామి రథోత్సవ అలంకరణ, అనంతరం స్వామి రథం లాగే కార్యక్రమాలు జరుగుతాయి. ఆదివారం తెల్లవారుజామున పెన్నానదీ తీరాన సిద్ధేశ్వర ఆలయం వద్ద గంగపూజ, వరసిద్ధేశ్వర పూజ, అశ్వర్ధ దర్శన పూజ, ఆలయం వద్ద తిరునాళ్ల జరుగుతాయని ఈఓ , ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు.

'ఆరోగ్య సురక్ష' పేదలకు వరం

శెట్టూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని ఈఓఆర్డీ రఘురామరావు, డాక్టర్ తరుణసాయి అన్నారు. శుక్రవారం మండంలోని కై రేవులో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ లక్ష్మీదేవి, సింగిల్ విండో సభ్యుడు గొర్ల గంగాధర, నాయకులు ప్రతాప్, హనుమంతురాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధమ్మ, ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

మరువ పారుతున్న కరుట్లపల్లి చెరువు



నీటితో కళకళలాడుతున్న కరుట్లపల్లి చెరువు

కూడేరు: మండలంలోని కరుట్లపల్లిలోని చెరువు శుక్రవారం మరువ పారింది. గ్రామ సమీపంలో హంద్రీ నీవా సుజల స్రవంతి కాలువ వెళ్లింది. పది రోజుల క్రితం చెరువులోకి హంద్రీ నీవా కాలువ నుంచి నీరు విడుదల చేశారు. కృష్ణా జలాలతో చెరువు పూర్తిగా నిండి నిండు కుండను తలపిస్తోంది. చెరువునీటితో భూగర్భజలాలు పెరిగి, సుమారు 2 వేల ఎకరాల్లో పంటల సాగుకు అనుకూలంగా ఉంటుంది.

కమనీయంగా నవనారసింహుడి కల్యాణోత్సవం





కల్యాణోత్సవం జరిపిస్తున్న వేదపండితులు, లక్ష్మీనరసింహస్వామికి పూజలు చేస్తున్న ఎంపీ రంగయ్య

రాయదుర్గం రూరల్: మండలంలోని మల్లాపురం వద్ద వెలిసిన విప్రమలై శ్రీలక్ష్మీ , నవనారసింహ స్వామి కల్యాణోత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి ఆధ్వర్యంలో ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నిత్యారాధన, దీక్షాహోమం నిర్వహించారు. అనంతరం లక్ష్మీసమేత నరసింహస్వామిని ఆలయ నుంచి నాగుల కట్ట వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ మంటపం వద్దకు మాలధారులు తీసుకొచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నమందు కల్యాణోత్సవం జరిపించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, దాతల సహకారంతో 8 పేదజంటలకు ఉచిత వివాహాలు జరిపారు.

నేడు రథోత్సవం : బ్రహ్మోత్సవాల చివరి ఘట్టం స్వామి రథోత్సవం శనివారం ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు రామూర్తి స్వామీజీ తెలిపారు. ఉదయం స్వామికి నిత్యకైంకర్యం స రథాంగ హోమం నిర్వహించి, ఉదయం 8 గంటలకు మడుగుతేరు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.


లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఎంపీ పూజలు

కంబదూరు: మండలంలోని కర్తనపర్తి కొత్తూరులో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎంపీ,నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య పూజలు నిర్వహించారు. ఆలయానికి రూ.35 లక్షలతో నూతనంగా గోపురం నిర్మించడంతో ప్రతిష్ట మహోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఎంపీ రంగయ్య ఆలయంలోని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. నూతన గోపురం ప్రతిష్ట మహోత్సవం నిర్వహించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, సర్పంచ్ శివన్న నాయకులు పాల్గొన్నారు.

లోక్‌సభ మాజీ స్పీకర్ మృతి బాధాకరం

కళ్యాణదుర్గం: లోక్‌సభ మాజీ స్పీకర్ మనోహర్ జోషి గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని అనంతపురం పార్లమెంట్ సభ్యుడు, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య విచారం వ్యక్తం చేశారు. మనోహర్ జోషి అకాల మరణంపై శుక్రవారం ఆయన స్పందించారు. 2002-2004 మధ్య లోక్‌సభ స్పీకర్‌గా పని చేశారని గుర్తుచేశారు. 1995-1999 మధ్య మహారాష్ట్ర సీఎంగా పని చేశారన్నారు. లౌక్యం కలిగిన ఓ గొప్ప నాయకుడిని కోల్పోయామని ఎంపీ అన్నారు.

వైభవంగా మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం



అలంకరణలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి



శ్రీరంగాపురంలో రంగనాథస్వామి ఆలయం వద్ద హోమం నిర్వహిస్తున్న వేదపండితులు



అలంకరణలో మల్లాపురం గజలక్ష్మీదేవి

ఉరవకొండ: స్థానిక ప్రసిద్ధిగాంచిన మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామికి అభిజిత్ లగ్నం నందు కల్యాణోత్సవం జరిపించారు. మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం శనివారం వైభవంగా జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా శ్రీరంగనాథుడి తిరుకల్యాణోత్సవం

బెళుగుప్ప: మండలంలోని శ్రీరంగాపురం శ్రీరంగనాథ స్వామి ఆలయంలో స్వామి తిరుకల్యాణోత్సవం శుక్రవారం ఉదయం నుంచి సుప్రభాత సేవ, గణపతి పుణ్యానాంది, నవగ్రహారాధన, గణపతి పూజలు నిర్వహించారు. సాయంత్రం గణపతి, నవగ్రహ, పూర్ణాహుతి హోమాలను వేద పండితులు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణోత్సవం అనంతరం ప్రభోత్సవ ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గజలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

రాయదుర్గంటౌన్: మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో వెలసిన గజలక్ష్మి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేసి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పట్టణంలోని దుగ్గిలమ్మ ఆలయం, దండుమారెమ్మ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

జగన్‌తోనే అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు



లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న నాయకులు

రాయదుర్గం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు అందాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. మాధవరెడ్డి అన్నారు. మండలంలోని 74 ఉడేగోళం సచివాలయంలో గ్రామ సర్పంచ్ దురుగమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో 17 మంది లబ్ధిదారులకు శుక్రవారం ఆయన ఇంటిపట్టాలు పంపిణీ చేశారు. అనంతరం సంక్షేమ సారధులు, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉన్న వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో మద్దానేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు బసవరాజు, సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ జయన్న, గ్రామ ఉపసర్పంచ్ రామకృష్ణారెడ్డి, కూల్ డ్రింక్ అప్పాజీ, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో తెలంగాణమాజీ చీఫ్ సెక్రటరీ



స్వామివారిని దర్శించుకున్న సోమేష్‌కుమార్, కుటుంబ సభ్యులు

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన పెన్నహోబిలం లక్ష్మీ నృసింహస్వామి ఆలయాన్ని కుటుంబ సమేతంగా తెలంగాణ మాజీ చీఫ్ సెక్రటరీ, జిల్లా పూర్వ కలెక్టర్ సోమేష్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీస్వామి స్వాగతం పలికారు. విశేష పూజల అనంతరం స్వామి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనతో అర్చకులు మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్‌గా ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఆలయ ముఖ ద్వారం వద్ద ఉగ్రనరసింహుడి విగ్రహం ఏర్పాటులో ఆయన తీసుకున్న చొరవను, ఆలయ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.

542 మందికి హెచ్‌బీ పరీక్షలు



హెచ్‌బీ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ఉరవకొండ: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు హెచ్‌బీ స్క్రీనింగ్ టెస్ట్‌లు శుక్రవారం చేశారు. ఈఏడాది మార్చి 1 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం, మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థినుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఉరవకొండ డివిజన్ మలేరియా అధికారి భక్తుల కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో 542 మందికి హెచ్‌బీ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, మేజర్ పంచాయతీ ఈఓ. గౌస్‌సాహెబ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భ్రూణ హత్యలను అరికడదాం



కూడేరు: మాట్లాడుతున్న వైద్యాధికారి లక్ష్మీనారాయణ

కూడేరు: భ్రూణ హత్యలను అరికట్టేందుకు కృషి చేద్దామని వైద్యాధికారి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం కూడేరులోని పీహెచ్‌సీలో లింగ వివక్షత, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమన్నారు. ఏ ఆస్పత్రుల్లోనైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే వారిపై చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు రవీంద్ర, యశోధ, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీ శిరీనా, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

విడపనకల్లు: మండల కేంద్రంలో శనివారం వలంటీర్లకు వందన కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ కేసీ కొండయ్య ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి హాజరవుతారన్నారు.

అకౌంట్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో ఉచిత శిక్షణ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో అకౌంట్ ఎగ్జిక్యూటివ్ (ట్యాలీ ప్రైమ్ అడ్వాన్స్) కోర్సులో శిక్షణకు నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి ఆనంద్‌రాజ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో స్కిల్ హబ్ సెంటర్‌లో మూడు నెలల పాటు ఉచితంగా అకౌంట్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీ, ఎంబీఏ, ఎంకామ్ పూర్తి చేసిన యువతీయువకులు మార్చి 12వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 9182920381 లో సంప్రదించాలన్నారు.

అడవులకు నిప్పు పెడితే చర్యలు

కుందుర్పి: అడవులకు నిప్పుపెడితే శాఖాపరమైన చర్యలు తప్పవని జంబుగుంపల అటవీ బీట్ ఆఫీసర్ పరమేశ్వరప్ప హెచ్చరించారు. వారం రోజులుగా జంబుగుంపల, బెస్తరపల్లి తదితర పంచాయతీల్లో వేసవిలో అడవులకు నిప్పు పడకుండా చేపట్టాల్సిన చర్యలు, మొక్కల పెంపకం వల్ల మానవాళికి కలిగే లాభాలపై ఆయా గ్రామాల ప్రజలు, పశువుల కాపర్లకు అవగాహన కల్పించారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాన్ని బలోపేతం చేద్దాం



అభివాదం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు

కళ్యాణదుర్గం: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాన్ని బలోపేతం చేద్దామని ఎస్సీ,ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు స్పష్టం చేశారు.శుక్రవారం స్థానిక ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు రాజగోపాల్, శెట్టూరు ఎంఈఓ శ్రీధర్, హెచ్‌ఎం పరమేశ్వరప్ప, రాజన్న మాట్లాడారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
రాయదుర్గం డివిజన్
9010470185, 9010006852, 9010223701